# నిజంలోని నిజం

ఖైరతాబాద్ సిటీ క్రైంబ్రాంచి ఆఫీసు.

ఇన్‌స్పెక్టర్ జగన్నాధం కుర్చీలో వెనక్కు చేరబడి కూర్చున్నాడు. ఫైల్సు తిరగేస్తూ తను ఎంతమంది చేత తమ తప్పుల్ని ఒప్పించాడో మననం చేసుకుంటున్నాడు.

ఎన్నో పేర్లు.

రకరకాల అపరాధాలు.

తన చేతిలోని కొరడా ఎందరి చేతనో అపరాధం చేసినట్లు ఒప్పించింది. దానికి యెందరి చెర్మమో అతుక్కుపోయింది.

అది తనకు గోల్డుమెడల్ కూడా ఇప్పించింది. తనకు అనతికాలంలోనే ప్రమోషన్ కూడా ఇప్పించింది. తన సీనియర్సు యెందరో ఇంకా సబిన్‌స్పెక్టర్లుగానే ఉన్నారు.

గడియారం చూసుకున్నాడు. రాత్రి పది దాటింది. డైరీ సొరుగులో పెట్టాడు. తాళం వేశాడు. పెద్ద పెద్ద

అంగలు వేసుకుంటూ బయటికి వచ్చాడు. జీప్ యెక్కి కూర్చున్నాడు. జీప్ పరుగుతీస్తోంది. రాజు జీపు ముందు పరుగెడుతున్నాడు. కళ్ళు మూసుకొని తెరిచాడు. మరో రూపం. మళ్ళీ కళ్ళు మూసుకొని చూశాడు. మరో రూపం. ఏమిటిది? కొద్ది రోజులుగా తనకు ఇలా జీపుముందు పరిగెత్తుతున్నట్లు ఎవరెవరివో రూపాలు కన్పిస్తున్నాయి.

రాజు నిజంగా అపరాధం చేశాడా? చెయ్యలేదేమో? ఛీ! ఏమిటి తను ఇలా ఆలోచిస్తున్నాడు? అదంతా తన కనవసరం. అపరాధం చేశానని అంగీకరించాడు. అంతే! అం అంతే!

జీపు ఇంటిముందు ఆగింది.

ఆర్డర్లీ లేచి సలాం కొట్టాడు.

ఇన్‌స్పెక్టర్ జగన్నాథం తన గదిలో తలుపులు మూసి గడియ పెట్టాడు.

బట్టలు మార్చుకొని మంచంమీద కూర్చుని సిగరెట్ వెలిగించుకున్నాడు.

ఉన్నట్టుండి వళ్ళు జలదరించింది.

వేళ్ళమధ్య ఉన్న సిగరెట్ కింద పడింది.

దిగ్గున మంచం దిగాడు.

నాసికాపుటాలను ఎగరేశాడు.

ఏదో వాసన!

రక్తపు వాసన!

కాదు-కాదు – చమట వాసన!

యెవరిది వాసన? తన గదిలో ఇంకెవరో ఉన్నారు.

జగన్నాథం వంగి మంచం కింద చూశాడు. గదంతా కలియచూశాడు. యెవరూ కన్పించలేదు. ఎవరూ లేరు. అంతా తన భ్రమ!

మరి ఈ వాసన ?

గదిలో అటూ ఇటూ తిరుగుతున్న అతనికి తన వెనకే యెవరో అడుగులో అడుగు వేసుకొంటూ తిరుగుతున్నట్టుగా తోచింది. జగన్నాథం ఠక్కున ఆగాడు. అతడూ ఆగాడు. జగన్నాథం గిర్రున తిరిగాడు. అతడు కూడా గిర్రున తిరిగి తన వెనకే నిల్చున్నట్టుగా గ్రహించాడు. గాలి కుంభించి, మెడ నించి వెనక్కు చూశాడు. యెవరూ కన్పించలేదు. బిగించిన గాలి వదిలాడు. రిలీఫ్ గా మళ్ళీ గాలి పీల్చుకున్నాడు.

రేడియో ఆన్ చేశాడు.

సోఫాలో జారిగిలపడి తెలుగు పాట వింటున్నాడు.

మళ్ళీ! అదే వాసన! వాడే, వాడే. తన వెనక – సోఫా వెనక నిల్చుని వాడూ పాట వింటున్నాడు.

"రాస్కెల్ యెన్ని గుండెలురా నీకు? నా గదిలోకే వచ్చి నా వెనకే తిరుగుతావురా?" సర్రున లేచాడు. వాడు అందినట్టే అంది తప్పుకుపోతున్నాడు.

"నాలోని నువ్వూ - నీలోని నేను - నువ్వు నేనయితే నేనే నువ్వయితే - హోయి-హోయి - మధురం మధురం - ఈ జీవితం - నిజం - నిజమే అబద్ధం - అబద్ధంలో నిజం- నిజంలో నిజం..."

జగన్నాథం ఒక్క దూకున వెళ్ళి ఆ కంఠం నొక్కేశాడు. రేడియో గోడకు కొట్టుకుంది.

పకపకా నవ్వు!

స్కౌండ్రల్ యెందుకలా నవ్వుతావ్?

గిరుక్కున తిరిగి వాడి మీదకు దూకాడు. కాని వాడు తప్పుకున్నాడు. స్విచ్ బోర్డు తగిలి జగన్నాథం ముఖం బొప్పి కట్టింది. నుదురును అరచేతితో రాసుకొంటూ సోఫాలో కూలిపోయాడు.

ఛ! ఛ! తనేం చేస్తున్నాడు'

అసలిక్కడ యెవడూ లేడే? అసలు లోపలకు యెలా వస్తాడు? తను తలుపులు వేశాడుగా? గడియ కూడా పెట్టాడా యె? తను రాగానే ఆర్డర్లీ తన ముందే తాళం తీశాడు. జగన్నాథం తలుపులకేసి చూశాడు. మూసే ఉన్నాయి. గడియ కూడా వేసే ఉంది.

ఇంపాజిబుల్!

ఇటీజ్ పాజిబుల్!

తన వెనకే జొరబడి ఉంటాడు.

యస్! యస్! వాడే! ఆ స్నేకీ రాస్కెల్. అదే చెమట వాసన! చివ్వున తలెత్తి చూశాడు.

"ఎవరు నువ్వు?"

ఎంత ధైర్యం వీడికి? తనకెదురుగా రొమ్ము విరుచుకొని నిలబడ్డాడు.

"మాట్లాడవేం?"

మాట్లాడడేం?

"యూ డర్టీ ..." పళ్ళు కొరుకుతూ లేచి గోడకు తగిలించి ఉన్న హంటర్ కసిగా లాగాడు.

ఛెళ్! ఛెళ్!

బలం కొద్దీ హంటర్ విసురుతున్నాడు.

అయినా వాడిలో ప్రతిక్రియ కన్పించడం లేదు.

జగన్నాథం అలసిపోతున్నాడు.

ఓడిపోతున్నాడు.

వాడి నోటినుండి ఒక్కమాట కక్కించలేక పోతున్నాడు. కనీసం కళ్ళవెంట నీరైనా పెట్టించలేకపోతున్నాడు.

జగన్నాథం హంటర్ నేలకేసి కొట్టాడు.

మంచంమీద కూలబడి సిగరెట్ ముట్టించాడు.

గట్టిగా పొగ పీల్చి వదులుతూ అతడికేసి ఓరగా చూశాడు. బెరుకు బెరుగ్గా చూశాడు. అతని లోపలినుంచి ఏదో తెలియని భయం తన్నుకొస్తూంది.

ఛా! ఏమిటిది? తనకా భయం?

మళ్ళీ వాడికేసి చూశాడు. ఈ సారి వాడి కళ్ళల్లో నీటి పొరలు కన్పించాయి.

వాడు ఏడుస్తున్నాడు.

మరికొద్ది క్షణాల్లో బావురుమంటాడు. తన కాళ్ళ మీద పడ్తాడు.

"రాస్కెల్ అలారారా దారికి!" గర్వంగా దర్పంగా వాడి ముఖంలోకి చూశాడు. తృళ్ళిపడ్డాడు.

ఆ కళ్ళు నిప్పులు కక్కుతున్నాయి. బడబాగ్ని అంటే ఇదేనేమో?

ఆ ముఖంలో ఎంతమాత్రం బెదురు లేదు, బాధ లేదు. బద్దలవడానికి సిద్ధంగా ఉన్న అగ్ని పర్వతంలా ఉన్నాడు. ముఖంలో, కళ్ళల్లో ఎలాంటి బాధా లేదు. మొండితనం ఉంది.

"ఒరేయ్! నువ్వు మొండివయితే నేను జగమొండినిరా! నీ చేత నిజం కక్కించగలనురా!'' అరిచాడు జగన్నాధం.

వాడిలో ఏమాత్రం చలనం లేదు.

జగన్నాధం చేతిలోని సిగరెట్ ను ఓ మూలకు విసిరాడు. ఏం చెయ్యాలో తోచక గదిలో అల్లిబిల్లి తిరిగాడు. నేలమీదున్న కొరడాను చూశాడు. దానిచుట్టూ ఉన్న తోలు ఊడిపోయి ఉంది.

చిత్రం. ఎంతమంది తోలో వొలిచిన ఈ కొరడా తోలు వీడు వొలిచేశాడు.

ఆర్డర్లీని పిలిస్తే?

తలుపువరకూ వెళ్ళి ఆగిపోయాడు జగన్నాధం.

నో! నో! తనే వీడ్ని లొంగదీసుకోవాలి. ఎవడో కొడ్తున్నప్పుడు విన్పించే హాహాకారాలను తను భరించలేడు. అంతసేపూ తన గుండెల్ని ఎవరో పిండివేస్తున్నట్టుగా ఉంటుంది. పోలీసాఫీసర్ కు ఉండకూడని బలహీనత తనలో ఉంది.

కాని స్వయంగా కుమ్ముతుంటే విన్పించే హాహాకారాలు తన చెవులకు ఘంటసాల పాట వింటున్నట్టుగా ఉంటుంది. అందుకే తనే వీడ్ని లొంగదీయాలి. వాడిచేత తనే నిజం చెప్పి...కాదు... కక్కిస్తాడు.

జగన్నాధం కిందకు వొంగి హంటర్ అందుకోబోయి తూలి మంచంమీద పడ్డాడు. మంచంమీద నుంచి ఎక్కడికో లోతులు తెలియని అగాధంలోకి పడిపోతున్నాడు — కాదు — కాదు — తన లోపలికే...లోలోపలికి దిగబడి పోతున్నాడు...

... ... ... ...

పసివాడి ఏడుపు దూరం నుంచి చిన్నగా విన్పిస్తూ క్షణం క్షణం దగ్గర అవుతోంది. బిగ్గరగా చెవులు చిల్లులు పడేలా వినిపిస్తోంది.

అరే ఆ గొంతు తనదే!

తనే ఏడుస్తున్నాడు.

తను తప్పు చెయ్యలేదు. నాన్న కొడుతున్నాడు, తనను తప్పు ఒప్పుకోమని కొడ్తున్నాడు. తను మొండికేసి నిల్చున్నాడు. తన వంటిమీద కొరడా నాట్యం చేస్తోంది.

"బాబూ! నాన్నా! ఒప్పుకోరా కన్నా! నేను ఈ హింసను చూడలేన్రా! నువ్వు తియ్యకపోయినా తీశానని ఒప్పుకోరా నాన్నా!" అమ్మ గోడు గోడున ఏడుస్తోంది.

అమ్మ ఏడుపు వినలేకపోయాడు. అమ్మ అనుభవిస్తున్న బాధ చూడలేకపోయాడు. అందుకే తను చెయ్యని తప్పును చేసినట్టు ఒప్పుకున్నాడు. ఆ రోజు నాన్న జేబులోనుంచి వంద రూపాయల నోటు ఎవరో - ఎవరో ఏమిటి అన్నయ్యే - తీశాడు.

తను అంతకు ముందు ఎన్నోసార్లు నాన్న జేబులోనుంచి రూపాయో, అర్ధా తీశాడు. నాన్న ఎంత కొట్టినా ఒళ్ళప్పగించాడే గాని తప్పు ఒప్పుకోలేదు. నాన్న కూడా రెండు మూడు దెబ్బలు కొట్టి వదిలేసేవాడు. పన్నెండేళ్ళు నిండని తను ఒక్కసారే వంద రూపాయలు దొంగిలించాడన్న భావం నాన్నను పిచ్చివాణ్ని చేసింది.

తన తండ్రి చండశాసనుడు. పిల్లల్ని డిసిప్లైన్ తో పెంచాలనే నమ్మకం గలవాడు.

ఎన్నో సార్లు తను తండ్రి చేత కొరడా దెబ్బలు తిన్నాడు. మొండిగా నిల్చుండి పోయేవాడు. కంటి వెంట నీరు కూడా వచ్చేది కాదు.

ఆ రోజు—ఆరోజు కూడా వళ్ళంతా చిట్లి రక్తం కారు తున్నా తను మొండిగానే నిల్చున్నాడు. తన మొండితనం తన తండ్రిని మరీ రెచ్చగొట్టింది.

చివరకు తన తల్లి బాధ చూడలేక నిజం - కాదు - కాదు - అబద్ధంలో నుంచి నిజం - కాదు నిజంలోని అబద్ధం- దాన్ని ఏమనాలో తనకు బోధపడటం లేదు — అది నిజంలోని నిజం మాత్రం కాదు — తను చెయ్యని తప్పును చేసినట్లు అంగీకరించాడు.

అప్పుడు చూడాలి తన నాన్న ముఖం!

చేతిలోని కొరడా అవతల పారేసి సంతృప్తిగా నిట్టూర్చాడు.

ఆ ముఖంలో సంతోషం! ఆ కళ్ళల్లో గర్వం!

అంతవరకు ఏడుపురాని తనకు నాన్న ముఖం చూసి ఏడుపు తన్నుకొచ్చింది. పెద్దగా ఏడ్చాడు.

తనలో ఏదో కసి ఆ రోజునుంచే పెరగసాగింది. పెరిగి... పెరిగి ... ... ...

జగన్నాథం తృళ్ళి పడ్డాడు. లోపలకు...లోలోపలకు దిగజారిపోయిన జగన్నాథం బయటకు వాడు-ఇంకా అలాగే ఎదురుగా నిలబడి తన కళ్ళలోకి చూస్తున్నాడు. ఆ కళ్ళలో ఎంత సంతృప్తి... హంటర్ చేతిలోకి తీసుకొన్నాడు.

ఛెళ్ ... ఛెళ్ ... ఛెళ్ ...

అప్పటికే ఇద్దరు ఆర్డర్లీలూ, వంటవాడు గదిముందుకొచ్చి నిలబడ్డారు. ఊపిరి బిగబట్టి చెవులు రిక్కించి నిల్చున్నారు.

ఒక్కసారిగా హంటర్ శబ్దం ఆగిపోయింది.

ఏదో 'దబ్బు' మని కిందపడ్డ శబ్దం — ఆ శబ్దం వెన్నంటి పెద్ద మూలుగు గోడ బయటకు విన్పించాయి.

"సాబ్! సాబ్!" గాభరాగా తలుపుమీద బాద సాగారు ఆర్డర్లీలు. జీప్ డ్రైవర్, ఇరుగు పొరుగువాళ్ళు చేరారు.

చివరకు తలుపులు బద్దలు కొట్టారు. గదిలోకి చూసిన ప్రతి ఒక్కడూ అవాక్కయి శిలా ప్రతిమల్లా నిలబడిపోయారు.

జగన్నాథం నిలువెత్తు శరీరం గదిలో అడ్డంగా పడివుంది.

శరీరమంతా చిట్లి రక్తం చిమ్ముతోంది.

అతని కుడిచేతి గుప్పెట్లో హంటర్ హాండిల్ అలాగే ఉంది.

0 0 0